

వేడెక్కిన కుప్పం రాజకీయం

కుప్పం మున్సిపల్ చైర్మన్ గిరీకోసం టీడీపీలో ఏర్పడిన పోటీ స్థానిక రాజకీయాలను వేడెక్కిస్తోంది.పార్టీ జాతీయ అధ్యక్షుడైన చంద్రబాబు సూచించే పేరునే చైర్మన్ అభ్యర్థిగా అంగీకరించాలన్న నిర్ణయం ప్రాథమికంగా జరిగింది.కుప్పం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెలలో కచ్చితంగా నిర్వహించాల్సిన నేపథ్యంలో టీడీపీ వ్యూహ రచనకు పదును పెడుతోంది.కంగుందిలోని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం ఫామ్ హౌస్‌లో మంగళవారం సాయంత్రం టీడీపీ కౌన్సిలర్ల సమావేశం జరిగింది. మరోవైపు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి వైసీపీ కౌన్సిలర్లతో టచ్‌లో వుంటూ ప్రత్యర్థుల వ్యూహాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.





పురపాలకసంఘాన్ని చేజిక్కించుకునే దిశగా టీడీపీ నాయకుల వ్యూహాలు

కంగుందిలో నేతలతో కౌన్సిలర్ల భేటీ

కుప్పం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):కుప్పం మున్సిపాలిటీలో 25 వార్డులుండగా, 19వార్డులను వైసీపీ, 6 వార్డులను టీడీపీ గెలుచుకున్నాయి. వైసీపీనుంచి గెలిచిన మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ గతేడాది డిసెంబర్ 6వ తేదీన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ పదవితోపాటు కౌన్సిలర్ పదవికి కూడా రాజీనామా చేశారు. అంతకు కొన్నిరోజుల ముందే ఆయన వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ఆయనకన్నా ముందే ఐదుగురు కౌన్సిలర్లు వైసీపీనుంచి టీడీపీలో చేరిపోయారు. తిరిగి వారిలో ఒకరు మళ్లీ వైసీపీ గూటికి చేరారు. అంటే ఇప్పుడు మున్సిపల్ కౌన్సిల్‌లో 10మంది టీడీపీ, 14మంది వైసీపీ కౌన్సిలర్లు ఉన్నారు. చైర్మన్ ఎన్నిక అంటూ జరిగితే డాక్టర్ సుధీర్ రాజీనామా చేసిన 16వ వార్డు ఖాళీ ఉంది కాబట్టి, 24మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భరత్ కలిపి మొత్తం 26మంది సభ్యులవుతారు. కౌన్సిల్ సమావేశ నిర్వహణకు అవసరమైన కోరం ఉండాలంటే కనీసం 13మంది కౌన్సిలర్లు హాజరు కావాలి. ఇప్పటికే టీడీపీకి 10 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అంటే ఇంకా నలుగురు కౌన్సిలర్లు అవసరం అవుతారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా హాజరయితే ఈ సంఖ్య మూడుకు తగ్గుతుంది.

కౌన్సిల్‌పై పట్టుకోసం ప్రయత్నాలు

ఏడు నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గంలోని కుప్పం మున్సిపల్ కౌన్సిల్‌లో పట్టుకోసం టీడీపీ ప్రయత్నాలు ప్రారంభించింది. నిబంధనల ప్రకారం మూడు నెలలకు ఓ సారి కౌన్సిల్ సమావేశం జరగాలి. ఆ గడువు గురువారంతో ముగియనుంది. మరికొద్ది రోజుల్లో అయినా కౌన్సిల్ సమావేశం నిర్వహించి చైర్మన్ గిరీని హస్తగతం చేసుకోవాలన్న ప్రయత్నాలు టీడీపీలో తీవ్రతరం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే కంగుంది ఫామ్ హౌస్‌లో ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్. మునిరత్నం, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ బాబులతోపాటు టీడీపీ కౌన్సిలర్లు 10మంది, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ మంగళవారం సాయంత్రం సమావేశమయ్యారు. మున్సిపల్ చైర్మన్ గిరీపై సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే ఈ పదవిని మొదటినుంచీ పార్టీలో ఉన్న అరుగురు కౌన్సిలర్లు కోరుకుంటున్నారు.వారితోపాటు కౌన్సిల్ వెలుపల ఉన్న ఒకరిద్దరు సైతం రంగంలో ఉన్నారు. డాక్టర్ సుధీర్ రాజీనామాతో ఖాళీగా ఉన్న 16వ వార్డు నుంచి పోటీ చేసి కౌన్సిలర్‌గా గెలిచి మరీ చైర్మన్ పదవి పొందాలని ఇటువంటి వారు ఆశపడుతున్నారు. అయితే చైర్మన్ అభ్యర్థి పేరును పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు సీల్డ్ కవర్లో పంపుతారని, ఆయన నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని ఎమ్మెల్సీ కంచర్ల సమావేశంలో స్పష్టం చేశారు. దానికి ముందు కౌన్సిల్‌లో కోరం కోసం అవసరమైన ముగ్గురు కౌన్సిలర్లను వైసీపీ నుంచి ఎలా తీసుకురావాలన్న దానిపై చర్చ నడిచింది. ఇందుకయ్యే ఖర్చు భరించేందుకు మాజీ ఒకరు సిద్ధపడినట్లు తెలిసింది.

నేడు అమరావతికి ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ గురువారం అమరావతికి పయనం అవుతున్నట్లు సమాచారం. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిపై అక్కడ చంద్రబాబు నుంచి పార్టీ శ్రేణులకు ఒక స్పష్టత లభించే అవకాశం ఉంది. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పేరు ఖరారు చేసుకుని కానీ, లేదా సంబంధిత సీల్డ్ కవర్ తీసుకుని కానీ ఎమ్మెల్సీ కంచర్ల కుప్పం వస్తారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

సరికొత్తగా సహకార వ్యవస్థ

ఎఫ్‌పీవోలుగా 11సింగిల్ విండోలు



చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను (ఎఫ్‌పీవో) ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించింది. తాజాగా జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ), ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సింగిల్ విండో)ను రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలు (ఎఫ్‌పీవోలు)గా రూపొందించాలని నిర్ణయించింది. తొలి విడతలో చిత్తూరు సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో 11 సహకార సంఘాలను ఎఫ్‌పీవోలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించారు.

తొలివిడతలో ఇవి ... : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 75 సింగిల్ విండోలు కొనసాగుతున్నాయి. వాటిలో తొలి విడతగా 11 సంఘాలను ఎంపిక చేశారు.చిత్తూరు జిల్లాలో .... రామకుప్పం, రొంపిచెర్ల, సదుం, యాదమరి. తిరుపతి జిల్లాలో .... మల్లంగుంట, ఎర్రావారిపాళ్యం.అన్నమయ్య జిల్లాలో ... పీలేరు, నిమ్మనపల్లి, కలికిరి, మదనపల్లి, కంభంవారిపల్లి సింగిల్ విండోలను ఎఫ్‌పీవోలుగా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

● ప్రోత్సాహక నిధులు

తొలివిడతలో ఎంపికైన సింగిల్ విండోల్లో త్వరలోనే సాధారణ సమావేశాలు నిర్వహించి ఎఫ్‌పీవోలుగా కార్యకలాపాలు నిర్వహించేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఒక్కొక్క సింగిల్ విండోకు రూ.15 లక్షలు ప్రోత్సాహక నిధులు, మూడేళ్ళపాటు కార్యకలాపాల నిర్వహణకు అదనంగా మరో ఏడాదికి రూ.6 లక్షల చొప్పున రూ.18 లక్షలు మంజూరు చేయనున్నారు. మౌలిక వసతుల కల్పనకు రుణంగా మరో రూ.30 లక్షలు కేటాయించనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు సింగిల్ విండోలను ఎఫ్‌పీవోలుగా మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఆయా సంఘాల తీర్మానాల మేరకు కార్యకలాపాలు ప్రారంభిస్తామని డీసీసీబీ సీఈవో మనోహర గౌడ్ తెలిపారు.

ఎన్‌సీడీ స్ర్కీనింగ్ పరీక్షలపై కలెక్టర్ సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న అసంక్రమిత వ్యాధి (ఎన్‌సీడీ) స్ర్కీనింగ్ పరీక్షలపై బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో కలెక్టర్ సుమిత్ కుమార్ సమీక్షించారు. సీఎంసీ, స్టార్ ఎన్‌సీడీ ఐసీఎంఆర్ వారి సాంకేతిక సహకారంతో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. 1,07,038 గృహాల్లో 18 ఏళ్ల నిండిన 2,75,467 మందికి స్ర్కీనింగ్ పరీక్ష జరిగిందన్నారు. హైపర్‌టెన్షన్ 39,762 మంది, డయాబెటిస్ 49,054 మంది, ఓరల్ క్యాన్సర్ 79, బ్రెస్ట్ క్యాన్సర్ 81, సర్వైకల్ క్యాన్సర్ 68 మందికి ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరికి అవసరమైన చికిత్సలు అందించడం జరుగుతోందన్నారు. డీసీహెచ్ఎస్ ప్రభావతి, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, డీపీఎంవో హనుమంతరావు, ఎన్‌సీడీ ప్రాజెక్టు ఆఫీసర్ శిరీష, హెల్త్ ఆఫీసర్ లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సీనియారిటీ జాబితాపై కసరత్తు

1989 డీఎస్సీ నుంచి మొదలు ● ఉమ్మడి చిత్తూరు జిల్లా కేంద్రంగా ప్రక్రియ

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సీనియారిటీ తయారీపై ఏళ్ల తరబడి ఉపాధ్యాయుల నిరీక్షణకు తెరపడింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా కేంద్రంగా చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల టీచర్ల సీనియారిటీ జాబితాను డీఈవో వరలక్ష్మి ఆధ్వర్యంలో 8 బృందాలు సిద్ధం చేస్తున్నాయి. 1989 నుంచి నిర్వహించిన డీఎస్సీలవారీగా సీనియారిటీ జాబితా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టీఐఎస్)లో సర్వీసు వివరాలు పొందుపర్చారు. వీటిని పరిశీలించడంతో పాటు డీఈవో కార్యాలయంలో టీచర్ల రికార్డులతో సరిపోల్చుతున్నారు.

మొత్తం 14,385 మంది టీచర్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 4,392 ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల్లో పనిచేస్తున్న 14,385 మంది టీచర్ల సీనియారిటీ జాబితాను సిద్ధం చేస్తున్నారు. 408 పాఠశాలల రెగ్యులర్ హెచ్ఎంల సీనియారిటీ జాబితా ఇప్పటికే పూర్తి చేశారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 8435 మందికిగాను 7,534 మంది పనిచేస్తుండగా, 901 ఖాళీలున్నాయి. వీరి సీనియారిటీ జాబితా ప్రక్రియ ఎంఈవో స్థాయిలో జరుగుతుండగా, ఆపై డీఈవో కార్యాలయంలో పరిశీలించనున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు 8,295 మందికిగాను 6,443 మంది పనిచేస్తుండగా 1,852 ఖాళీలున్నాయి. వీరిలో ఇప్పటి వరకు 3,180 వరకు సీనియారిటీ జాబితా పూర్తి చేశారు. మిగిలినవారివి ఎంఈవో స్థాయిల్లో జరుగుతోంది.



11వ తేదీనాటికి జాబితా పంపేలా చర్యలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాల టీచర్ల సీనియారిటీ జాబితా ఈనెల 11వ తేదీ నాటికి రాష్ట్ర విద్యాశాఖకు పంపేందుకు చర్యలు తీసుకున్నాం. ఇద్దరు ఏడీలు, ఇద్దరు సూపరిటెండెంట్ల పర్యవేక్షణలో ఎనిమిది బృందాలను ఏర్పాటు చేశాం. తొలుత మండలస్థాయి, ఆపై జిల్లా స్థాయిలో ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటికే దాదాపు పూర్తి చేశాం. స్కూల్ అసిస్టెంట్ల కేటగిరీ చేయాల్సి ఉంది. ఈనెల 10వ తేదీన జిల్లా స్థాయిలో ప్రక్రియ పూర్తి చేయనున్నాం.

- వరలక్ష్మి, డీఈవో

రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెలు దుర్మరణం



మంజుల, రవి మృతదేహాలు

విజయపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెలు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నింద్ర మండలం అగరం దళితవాడకు చెందిన రవి(58).. తన చెల్లెలు మంజుల(44)కు అనారోగ్యంగా ఉండటంతో ద్విచక్ర వాహనంలో విజయపురం మండలం పన్నూరు సబ్‌స్టేషన్‌లో చికిత్స చేయించాడు. అక్కడి నుంచి తన బంధువుల ఇంటికి కేవీపురం బయల్దేరారు. విజయపురం మండలం తెల్లగుంట వద్దకొచ్చేసరికి రాత్రి సుమారు 7.30 గంటలప్పుడు గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బలరాం తెలిపారు.

ఈ ఏడాదిలోగా లబ్ధిదారులకు టిడ్కో గృహాల పంపిణీ

● చైర్మన్ అజయ్‌కుమార్



టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ అజయ్‌కుమార్, మేయర్, తదితరులు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాలన్నింటినీ సిద్ధం చేసి, ఈ ఏడాదిలోగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం చిత్తూరు పూనేపల్లె వద్ద నిర్మించిన గృహ సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టిడ్కో గృహాలను అన్ని వసతులతో పూర్తిచేసి.. వీలైనంత త్వరగా లబ్ధిదారులకు ఇవ్వాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆదేశించారని చెప్పారు. గృహ సముదాయాల్లోని 2,800 గృహాలకు 2,400 వరకు పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన పెండింగ్ పనులను పూర్తిచేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. కాగా, రుణాలపై బ్యాంకులు ఒత్తిడి చేస్తున్నాయని లబ్ధిదారులు తెలిపారని, ఈ విషయంలోనూ తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారని గుర్తుచేశారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ నరసింహప్రసాద్, టిడ్కో ఈఈ దేవిక, డీఈ వెంకటముని, స్థానిక నాయకులు జీజేఎం ట్రస్టు చైర్మన్ గురజాల చెన్నకేశవులు నాయుడు, జనసేన నేత చైతన్య, తదితరులు పాల్గొన్నారు.



జైరామ్ ఠాకూర్

తిరుమలలో క్రికెటర్ స్మృతి మంధాన

తిరుమల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్, మహిళా క్రికెటర్ స్మృతి మంధాన దర్శించుకున్నారు. ఆలయం ముందు స్మృతి మంధానతో సెల్ఫీలు తీసుకునేందుకు భక్తులు ఎగబడ్డారు.



కుటుంబ సభ్యులతో స్మృతి మంధాన

సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.21 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,599

తలనీలాలు సమర్పించినవారు: 16,069





వివిధ టోర్నీలో వచ్చిన పతకాలతో..

కష్టాలకు ఎదురొడ్డి నిలిచి యోగా రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించారు వెంకటగిరికి చెందిన వసంతలక్ష్మి. తిరుపతిలోనే ఇంటర్, డిగ్రీ చదివిన ఈమె లెక్కకు మించి యోగా వీడియోలతో యూట్యూబు వీక్షకుల్లో పేరు సంపాదించారు. ఇటీవల నిర్వహించిన యోగా ప్రక్రియ గిన్నిస్ రికార్డులో నమోదు కావడంతో సీఎం చంద్రబాబు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేశ్‌శర్మ,శాప్‌చైర్మన్ రవినాయుడు ప్రత్యేకంగా ఈమెను అభినందించారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మి ఆంధ్రజ్యోతితో తన అనుభవాలను పంచుకున్నారిలా..

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి

వసంత 'యోగం'



●నిర్విరామంగా శిక్షణ తరగతులు ● గిన్నిస్ బుక్‌లో వెంకటగిరి మహిళ

ఇంటర్ చదువుతుండగానే నాకు పెళ్లయింది. మా ఆయన హేమాధర్ ఆర్టీసీ కండక్టర్. పెళ్లయినా తిరుపతిలో డిగ్రీ చదివాను. ఉద్యోగ జీవితంలో మాఆయనకు ఒడుదుడుకులు ఎదురయ్యాయి. ఆర్థికపరమైన సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో 2009లో హైదరాబాదుకు వలస వెళ్లాం. అక్కడే చిన్న చిన్న ఉద్యోగాలు చేశాను. పని ఒత్తిడిని భరించలేక 2011లో యోగా శిక్షణకు వెళ్లాను. ఇది నా జీవితగతిని మలుపుతిప్పింది. ఆరు నెలల్లోనే ఆసనాలన్నీ నేర్చుకున్నాను. నేనే ఎందుకు యోగా నేర్పకూడదనే తలంపు వచ్చింది. వెనకడుగు వేయకుండా వెంటనే యోగా తరగతులు చెప్పడానికి శ్రీకారం చుట్టాను. యోగాలో మరిన్ని ఉన్నత కోర్సులు చేశాను. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి సర్టిఫికేషన్ తీసుకున్నాక మంచి అవకాశాలు వచ్చాయి. స్వదేశ, విదేశ యోగా టోర్నీలో పాల్గొన్న ప్రతిసారీ పతకాలొచ్చాయి. హైదరాబాదులో కేజీకే ఇన్‌స్టిట్యూట్ 'యోగావిశారద బిరుదు ప్రదానం చేయడంతో గుర్తింపు వచ్చింది. కరోనా సమయంలో అపోలో ఆస్పత్రి చైర్మన్ ప్రతాప్ సిరెడ్డి సూచనతో చిత్తూరు జిల్లాలోని 252గ్రామాల్లో యోగా శిబిరాలను నిర్వహించాను. చాలామంది కరోనా నుంచి బయటపడటంతో ప్రతాప్ సిరెడ్డితో పాటు ప్రజలు విశేషంగా ఆదరించారు. వివిధ ఛానల్స్ నుంచి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని కెరీర్‌కు గట్టి పునాది వేసుకోగలిగాను. ఇప్పుడు అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడా, నైరోబి, మరికొన్ని దేశాల వారికి ఆన్‌లైన్‌లో క్లాసులు నిర్వహిస్తున్నాను. మన దేశానికి చెందిన వివిధ వృత్తి నిపుణులు ఇందులో పాల్గొంటున్నారు. అధికబరువు, థైరాయిండ్, మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగాసనాలు చక్కటి పరిష్కారమని నిరూపించడంలో సఫలీకృతమయ్యాను. 2020లో చొరవ తీసుకుని వసంతయోగా అకాడమీ పెట్టాను. 2023 నవంబరులో సంస్థ సారథ్యంలో 45మందితో 28నిమిషాల్లో చేసిన 108 సూర్యనమస్కారాల కార్యక్రమం రికార్డు నెలకొల్పింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డు, ఆన్‌లైన్ క్లాసుల ద్వారా నోబుల్ బుక్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులు వరించాయి. 2023 డిసెంబరులో 3.42గంటలపాటు చేసిన 'సమకోణాసనం' గతేడాది డిసెంబరులో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు దక్కించుకుంది. ఏదశలోనూ నిరాశను దరిచేయకుండా పట్టుదలతో పనిచేయడాన్ని అలవర్చుకోవడం వల్లే యోగా వసంతలక్ష్మిగా గుర్తింపు పొందగలిగానని వసంతలక్ష్మి వివరించారు.



తెలంగాణ గవర్నర్ జిష్ణుదేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వసంతలక్ష్మి



కుమారుడు, భర్తతో వసంతలక్ష్మి

'విశ్వంభర' బ్లాక్‌బస్టర్ అవుతుంది

తిరుమల, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని ఆ చిత్ర దర్శకుడు వశిష్ట ధీమా వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం'విశ్వంభర' చిత్రం షూటింగ్ జరుగుతోందని, మధ్యలో శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చానని తెలిపారు. విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఓప్రశ్నకు బదులిచ్చారు.



దర్శకుడు వశిష్ట



అలిపిరి తీరు మారదా?

అన్యమత స్టిక్కర్‌తో తిరుమలకు కారు

తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు ముఖద్వారమైన అలిపిరిలో మరోసారి భద్రతావైఫల్యం బయటపడింది. అన్యమత వ్యాఖ్యలతో కూడిన స్టిక్కర్‌తో ఓ కారు నేరుగా తిరుమలకు చేరుకుంది. సాధారణంగా రాజకీయ, ఇతర మత గుర్తులు, జెండాలతో తిరుమలకు రావడం నిషేధం. బుధవారం ఓ కారు అన్యమతానికి చెందిన వ్యాఖ్యతో ఉన్న స్టిక్కర్‌తో తిరుమలకు చేరుకుంది. దీనిని చూసిన పలువురు మీడియాకు సమాచారం ఇచ్చారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై ఆ కారును వెనక్కి పంపేశారు.

మరి దీన్నేమంటారు..?

● డిప్యూటీ మేయర్ ఎన్నికలో టీడీపీకి అనుకూలంగా ఓటు వేశారని కక్షకట్టిన వైసీపీ

● టౌన్ బ్యాంకు అధికారులతో బెదిరింపులు ● లోను కట్టకపోతే దండోరా వేస్తామంటూ హెచ్చరిక

తిరుపతి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్ ఎన్నికలో టీడీపీకి అనుకూలంగా ఓటు వేశారన్న కారణంగా తమ అధికారంలో ఉన్న టౌన్ బ్యాంకును అడ్డుపెట్టుకుని వైసీపీ కక్షపూరిత చర్యలకు పూనుకుంది. తిరుపతి టౌన్‌బ్యాంకులో తీసుకున్న లోను బకాయి ఇప్పటికిప్పుడు చెల్లించాలంటూ బుధవారం ఉదయం 17వ డివిజన్ కార్పొరేటర్ రత్నకుమారి ఇంటికి అధికారులు వెళ్లారు. ఉన్నపళంగా చెల్లించకపోతే వీధిలో దండోరా వేస్తామని హెచ్చరించారు. బంధువులందరికీ ఫోన్లు చేసి బ్యాంకులో తీసుకున్న రుణం చెల్లించలేదంటూ బదనాం చేస్తామని బెదిరింపులకు పూనుకున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హఠాత్తుగా లోను కట్టాలని రావడం ఏమిటని, గడువు ఇస్తే చెల్లిస్తామని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఇంతలో పోలీసులు అక్కడికి చేరుకుని టౌన్ బ్యాంకు సిబ్బందితో మాట్లాడి పంపించేశారు. పైస్థాయిలో ఒత్తిడి కారణంగా తాము రావాల్సివచ్చిందని వారు చెప్పినట్టు తెలిసింది. టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ తాళ్లూరు ప్రసాద్ వైసీపీ నాయకుడు. ఆయన భార్య రత్నకుమారి 17వ డివిజన్ కార్పొరేటర్. టౌన్ బ్యాంకు నుంచి ఇరువురు కలసి సుమారు రూ.15లక్షల రుణం తీసుకున్నారు. తాజాగా జరిగిన కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికలో వైసీపీ శిబిరంలోనే ఆమె ఉంటూ వచ్చారు. ఎన్నిక రోజు కూడా వారి బస్సులోనే సెనేట్ హాలుకు చేరుకున్నారు. ఓటు మాత్రం కూటమి బలపరిచిన టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణకు వేశారు. దీంతో కౌన్సిల్ హాలులోనే కొందరు వైసీపీ మహిళా కార్పొరేటర్లు ఆమెను తూలనాడారు. సమావేశం అనంతరం ఆమె విలపిస్తూ సొమ్మసిల్లి బయట సోఫాలో వాలిపోయారు. 24 గంటలు గడవకముందే వైసీపీ తన పాత వైఖరినే ప్రదర్శించింది. వైసీపీ నేతృత్వంలోని టౌన్ బ్యాంకు పాలకమండలిని అడ్డుపెట్టుకుని కక్షకు తెరలేపింది. నిన్నటివరకు తమ కార్పొరేటర్ల ఆస్తులను కూల్చేస్తామని కూటమి నేతలు బెదిరిస్తున్నారంటూ వైసీపీ నేతలు గగ్గోలు పెట్టారు. మరి వారికి అనుకూలంగా ఓటు వేయలేదని, టౌన్‌బ్యాంకులో ఉన్న అధికారంతో తన పార్టీ కార్పొరేటర్ మీదే పగతీర్చుకోవడాన్ని ఏమంటారో సమాధానం చెప్పాల్సి వుంది.



రత్నకుమారి ఇంటి వద్ద టౌన్‌బ్యాంకు సిబ్బంది

జిల్లాకు 56 కొత్త బస్సులు

కోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాకు ఈ ఏడాది 56 కొత్త బస్సు సర్వీసులు రానున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ నరసింహులు తెలిపారు. బుధవారం కోట బస్టాండ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 846 బస్సులు కండిషన్‌లో ఉంటూ వివిధ ప్రాంతాలకు తిరుగుతున్నాయన్నారు. తిరుపతి నగరంలో నాలుగు డిపోల నుంచి 400 బస్సులు తిరుమలకు రాకపోకలు సాగిస్తున్నాయని, ఇందులో 100 ఎలక్ట్రికల్ బస్సులు కూడా నడుపుతున్నామన్నారు. కోట నుంచి తిరుమల, చిట్టమూరు నుంచి చెన్నైకు బస్సు సర్వీసులను నడపాలని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని, ఆయా సర్వీసుల ఏర్పాట్లపై దృష్టి పెడుతామన్నారు. జిల్లాలో ఆర్టీసీ డ్రైవర్ల కొరత ఉన్నందున డ్రైవింగ్‌లో అనుభవం కలిగిన యువతకు కాంట్రాక్ట్ పద్ధతిన నియామకాలు చేపడుతామన్నారు. ఆయన వెంట వాకాడు డీఎం చినపెంచలయ్య, జూనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమ్మ, గ్యారేజ్ ఇన్‌చార్జి నారాయణ, కంట్రోలర్ జార్జ్ ఉన్నారు.



మీడియాతో ఆర్ఎం నరసింహులు

గ్రావెల్ తవ్వకాలపై ఆర్డీవో చర్యలు

రెండు హిటాచీల సీజ్

దొరవారిసత్రం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పూలతోటమిట్ట నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా రవాణ చేసే గ్రావెల్ మట్టి మాఫియాపై సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి బుధవారం దాడులు జరిపింది. రెండు రోజులుగా పూలతోటమిట్ట గ్రామంలోని అసైన్‌మెంట్ భూముల నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వి సూళ్లూరుపేట ప్రాంతంలోని ఓ పరిశ్రమకు తరలిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు అందడంతో బుధవారం ఆర్డీవో గ్రావెల్ తవ్వుతున్న భూములను పరిశీలించారు. అక్కడున్న రెండు హిటాచీలను సీజ్ చేసి ఎస్‌ఐ అజయ్‌కుమార్‌కు అప్పగించారు. అనుమతి లేకుండా గ్రావెల్‌ను తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హెచ్చరించారు.



ఎస్ఐకు సూచనలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

చైర్మన్‌గా ఉన్నా సేవకుడినే..

● భావోద్వేగానికి గురైన బీఆర్ నాయుడు



తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చైర్మన్ పదవి వచ్చినా తానూ సేవకుడినేనని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తిరుమలలోని శ్రీవారిసేవాసదన్-2లో బుధవారం ఆయన శ్రీవారిసేవకులను ఉద్దేశించి మాట్లాడుతూ..తాను కొన్నేళ్లుగా శ్రీవారికి సేవ చేయాలని చాలా ప్రయత్నించానన్నారు. మూడు నెలల క్రితం సీఎం చంద్రబాబు తనకు చైర్మన్‌గా సేవ చేసే అవకాశమిచ్చారంటూ కంటనీరు పెట్టుకున్నారు. వెంటనే భావోద్వేగాన్ని అదుపు చేసుకున్నారు. ఎన్నోసార్లు స్వామి దర్శనం లభించకగా తిరిగి వెళ్లిపోయిన సందర్భాలున్నాయని గుర్తు చేసుకున్నారు. రథసప్తమి సందర్భంగా భక్తులకు సేవలందించిన శ్రీవారి సేవకులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఎప్పుడైనా నేరుగా వచ్చి తనను కలవచ్చునన్నారు. అనంతరం ఆలయంలో పనిచేసేందుకు డిప్ సిస్టమ్ బటన్ నొక్కి, ఆన్‌లైన్‌లో 520 మందికి సేవ చేసేలా ఆటోమెటిక్ కేటాయింపు చేశారు. అనంతరం చైర్మన్‌ను సీపీఆర్వో రవి శాలువాతో సత్కరించారు.

ఆగివున్న మినీ లారీని ఢీకొన్న కారు

మహిళ దుర్మరణం, మరో నలుగురికి తీవ్ర గాయాలు ● తిరుమల వెళ్లొస్తుండగా ప్రమాదం



మృతి చెందిన ప్రవీణ - వ్యాన్‌ను ఢీకొన్న కారు - గాయపడిన అనూష, లక్ష్మీనారాయణ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా తరలించే మినీలారీ టైరు పంచరై.. రోడుపైన ఆగింది. దీనిని కారు ఢీకొనడంతో ఓ మహిళ మృతిచెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేటకు చెందిన ప్రవీణ, ఆమె కుమార్తె అనూష, వారి సమీప బంధువులైన పశ్చిమ గోదావరి జిల్లా గణపవరానికి చెందిన విశ్వనాథముని లక్ష్మీనారాయణ, రాజ్యలక్ష్మి దంపతులు, కుమారుడు సుమంత్ కలిసి మంగళవారం కారులో తిరుమల వెళ్లారు. శ్రీవారి దర్శనానంతరం తిరిగి నాయుడుపేటకు వెళ్తుండగా బుధవారం తెల్లవారుజామున మల్లాం జంక్షన్ సమీపంలోని రింగ్‌రోడ్డు వద్ద ఆగివున్న మీని లారీని వీరి కారు వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రవీణ(44) అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది, పోలీసులు క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రి, ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. సుమంత్, లక్ష్మీనారాయణ పరిస్థితి విషమంగా ఉండడంలో నెల్లూరుకు పంపించారు. ప్రవీణ మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. నాయుడుపేట పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న మినీ లారీ టైరు పంక్చర్ అవడంతో రోడ్డుమీద ఆగిపోయిందని, డ్రైవర్ పరారైనట్లు పోలీసులు తెలిపారు. మినీలారీలో ఉన్న 3,300 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం ఏఎంసీ గోదాముకు తరలించారు.

మద్యం షాపులకు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 5 ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మిక ఉపకులాల వారికి కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువును ఈనెల 8వ తేది వరకు పొడిగించినట్లు జిల్లా ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వీరికోసం జిల్లాలో 23 మద్యం దుకాణాలను ప్రభుత్వం కేటాయించినట్లు వివరించారు. ఈనెల 8వ తేది సాయత్రరం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సాధారణ లైసెన్సు ఫీజులో సగం ధరనే వీరికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలోని ఏ పట్టణం, నగరం, మండలంలోనైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో కానీ దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. ఈ నెల 10న ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిన దుకాణాల ఎంపిక, కేటాయింపులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని గీత కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నాగమల్లేశ్వరరెడ్డి

కొందరు కార్పొరేటర్లపై వైసీపీ వేటు

● మరికొందరికి వెసులుబాటుపై పార్టీలో అంతర్గత చర్చ

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమికి మద్దతు పలికిన కార్పొరేటర్లలో కొందరిపై వైసీపీ బహిష్కరణ వేటు వేసింది. మరికొందరిని వదిలేయడం ఆ పార్టీలో అంతర్గత చర్చ మొదలైంది. 10వ డివిజన్ కార్పొరేటరు ప్రతాప్ ఎరెడ్డి, 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళ్లిక, ఆమె భర్త దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, 32వ డివిజన్ కార్పొరేటర్ శైలజ, ఆమె భర్త వేణుగోపాల్, 33వ డివిజన్ కార్పొరేటర్ దూది కుమారి, ఆమె భర్త శివప్రసాద్, 43వ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రాధ, ఆమె భర్త మురళియాదవ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడి పేరుతో ప్రకటన విడుదల చేశారు. ఇక, కూటమి అభ్యర్థికి ఓటు వేసిన వైసీపీ కార్పొరేటర్లు అనీష్ రాయల్, బోకం అనిల్, మోహన్ కృష్ణయాదవ్, తటస్థంగా ఉన్న పల్లూరు అమరనాథరెడ్డిపై వేటు పడకపోవడం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముందస్తు ప్రణాళికతోనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారా అన్న చర్చ కూడా నడుస్తోంది. వైసీపీ వాళ్లతో పాటే సెనేట్ హాలులోకి వెళ్లి.. కూటమి అభ్యర్థికి మద్దతిచ్చిన తాళ్లూరి రత్నకుమారిపైనా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

మళ్లీ రూ.వంద కోట్లు దాటింది

● 35 నెలలుగా.. ప్రతినెలా శ్రీవారి హుండీ ఆదాయం రూ.వంద కోట్లపైనే

తిరుమల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం మళ్లీ వంద కోట్లు దాటింది. జనవరిలో భక్తులు హుండీలో వేసిన కానుకల ద్వారా రూ.106.17 కోట్లు లభించాయి. కాగా, కొవిడ్ అనంతరం 2022 మార్చి నెల నుంచి ప్రతి నెలా రూ.వంద కోట్లకు పైగా హుండీ ఆదాయం లభిస్తున్న విషయం తెలిసిందే. 2022 మార్చి నుంచి డిసెంబరు నెల నాటికి రూ.1,291.69 కోట్లు, 2023లో రూ.1,403.47 కోట్లు, 2024లో 1,365 కోట్లు హుండీ ద్వారా లభించాయి. ఇక, 2025 జనవరి నెలలో రూ.106.17 కోట్లు లభించడం గమనార్హం. ఇలా 35 నెలలుగా.. ప్రతి నెలా రూ.వంద కోట్లకుపైగా శ్రీవారి హుండీ కానుకలు లభిస్తున్నాయి. టీటీడీ ప్రధాన ఆర్థిక వనరుగా స్వామి హుండీ మారుతోంది.

స్విమ్స్‌లో మృతదేహం కోసం ఆందోళన

మాకివ్వాలంటే మాకివ్వాలని రెండు వర్గాల పట్టు

సర్దిచెప్పి పంపిన పోలీసులు, స్విమ్స్ అధికారులు



స్విమ్స్‌లో ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మృతదేహాన్ని తమకంటే తతమకు అప్పగించాలంటూ రెండు వర్గాల వారు స్విమ్స్‌లో ఆందోళనకు దిగారు. నారాయణవనం మండలం చిత్తూరుకండ్రిగకు చెందిన రిటైర్డ్ విద్యుత్తు ఉద్యోగి కేవీ.సుబ్రహ్మణ్యం(79) అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన రెండో భార్య ఝాన్సీ మంగళవారం రాత్రి స్విమ్స్‌కు తీసుకురాగా.. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మొదటి భార్య పద్మావతి స్విమ్స్‌కు చేరుకుని మృతదేహాన్ని తమకు అప్పగించాలని కోరారు. స్విమ్స్ అధికారులు కూడా మృతదేహాన్ని ఆమెకు అప్పగించేందుకు సిద్ధమయ్యారు. ఆయన 30 ఏళ్లుగా తమ వద్దే ఉన్నారని, చిత్తూరుకండ్రిగలోనే అంత్యక్రియలు నిర్వహించాలని ఆయన బతికున్నప్పుడే రాసుకున్నాడని రెండో భార్య ఝాన్సీ చెప్పారు. నిబంధనల మేరకు మృతదేహాన్ని మొదటి భార్యకే అప్పగిస్తామని స్విమ్స్ అధికారులు చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మార్చురీ ముందు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వెస్ట్ పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాల వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ససేమిరా అన్నారు. చాలాసేపు చర్చల తర్వాత అందరూ కలిసి మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తీసుకువెళ్లారు.

భూమన అభినయ్‌పై కేసు

తిరుపతి(నేర విభాగం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత భూమన అభినయ్‌పై అలిపిరి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ రాం కిషోర్ తెలిపిన ప్రకారం.. డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో కూటమి నాయకులను కార్పొరేటర్ స్రవంతి తమ్ముడు రాజేష్ బెదిరిస్తున్నాడని కొందరు టీడీపీ నాయకులు డయల్ 100కు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం రాజేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలిసిన అభినయ్ తన అనుచరులతో అలిపిరి పోలీసు స్టేషన్‌కు వెళ్లి రాజేష్‌ను విడిచి పెట్టాలని డిమాండు చేశారు. పోలీసు అధికారుల ఆదేశాలు ఉన్నాయని సిబ్బంది చెప్పినా అభినయ్ వాగ్వాదానికి దిగారు. దీనిపై పోలీసులు సుబ్రమణ్యం, చంద్ర, ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రేషన్ సరఫరాలో అవకతవకలా..

94905 51117కు ఫిర్యాదు చేయండి

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 'రేషన్ సరఫరా.. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాల్లో ఏవైనా అవకతవకలు జరుగుతున్నాయా? అలాంటి వాటిని వీడియోల ద్వారా 94905 51117 నెంబరుకు ఫిర్యాదు చేయొచ్చు' అని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి సూచించారు. గూడూరులోని సీఎస్ఎం ఉన్నత పాఠశాల, గిరిజన బాలికల గురుకుల పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలను బుధవారం సందర్శించిన ఆయన ఆహార నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పేదలకు నాణ్యత కలిగిన రేషన్‌బియ్యం పంపిణీ చేసేలా ఫుడ్‌కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. కొన్ని పాఠశాలల్లో అక్షయపాత్ర ద్వారా సరఫరా చేస్తున్న ఆహారం రుచిగా లేదని ఫిర్యాదులు అందాయన్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సరిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దారు చంద్రశేఖర్, డిప్యూటీఈవో సనత్‌కుమార్, ఎంఈవో కాంచన, సీడీపీవో మెహబూబి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ట్రావెన్‌కోర్ సంస్థానం రాణి




ఆలయంలో ట్రావెన్‌కోర్ సంస్థానం రాణి లక్ష్మీబాయి, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె దీపా వెంకట్

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ట్రావెన్‌కోర్ సంస్థానం రాణి లక్ష్మీబాయి బుధవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను ఆలయ మాజీ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే స్వామి సేవలో స్వర్ణ భారత్ ట్రస్టు ఛైర్‌పర్సన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె దీపావెంకట్ పాల్గొన్నారు.

'మంగళ విద్యావాణి' ఆవిష్కరణ



మంగళ విద్యావాణి సంచికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలం మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రూపొందించే మంగళ విద్యావాణి మాసపత్రిక 33వ సంచికను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హెచ్.అరుణ శివప్రసాద్, హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పిళ్ళారప్ప, భారతి, సంపంగి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ విద్యార్థులు హేమ, లహరి, పునీత్ సాయి నిర్వహించే గణిత ప్రజ్ఞాధారణపై కలెక్టర్‌కు హెచ్‌ఎం వివరించగా, ఆయన వారిని అభినందించారు.

ఆత్మరక్షణపై బాలికలకు ఉచిత శిక్షణ

- సొసైటీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఆదర్శ, కేజీబీవీ, సాంఘిక, గిరిజన సంక్షేమ యాజమాన్యాల్లోని విద్యార్థినులకు రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్ష పరిశీలన - ఆత్మ రక్ష ప్రశిక్షణ్ (సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం) పథకం కింద ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఎస్‌ఎస్ ఏపీసీ వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6-9 ఏళ్ల లోపు వయసున్న 33,620 మంది బాలికలకు 20 సెషన్స్ కరాటే, తైక్వాండో వంటి స్వీయ రక్షణ కళల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. దీనికోసం రిజిస్టర్ కాబడిన సొసైటీ, ట్రస్టులు కనీసం మూడేళ్ల అనుభవం కలిగినవారు 8వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు విద్యాశాఖ ప్రాంగణంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

మద్యం దుకాణాల దరఖాస్తు గడువు 8వరకు పొడిగింపు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిల్లాలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన 10 మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు ఈనెల 8వ తేదీవరకు పొడిగించింది. ఈ మేరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 13 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. పదో తేదీన ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ మీటింగ్ హాల్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు ఉంటుందని వివరించారు.

కుప్పం సమగ్ర అభివృద్ధిపై సీఎంవో సమీక్ష

కుప్పం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజక వర్గాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలో భాగంగా సీఎంవోలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల నుండి వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టిసారించారు. భూవివాదాలు, దారి సమస్యల పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రైతులకు లాభసాటి వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయ సాగు, తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు వంటి అంశాలపై సీఎంవో దిశానిర్దేశం చేశారు. అంతే కాకుండా ప్రతి ఇంటికీ సోలరైజేషన్ చేసేలా సూర్యఘర్ ప్రాజెక్టును అందరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే కుప్పం ఆర్టీసీ బస్టాండును మోడ్రన్ బస్టాండుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. అధికారులకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కడా పీవో వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ స్థానిక కూటమి నేతలతో కలసి సమన్వయంతో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచనలు ఇచ్చారు.

మూడో రోజుకు వెటర్నరీ విద్యార్థుల సమ్మె

- అధ్యాపకుల సీఏఎస్ ఇంటర్వ్యూలను అడ్డుకునే ప్రయత్నం



పరిపాలనా భవనం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా తమకు ఉపకార వేతనం(స్టైఫండ్) అందించాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారమూ కొనసాగింది. ఉదయం వర్సిటీ పరిపాలనా భవనంలో జరిగే అధ్యాపకుల సీఏఎస్ ఇంటర్వ్యూలను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థులు పరిపాలనా భవనంలోకి ప్రవేశించకుండా వర్సిటీ సిబ్బంది ప్రధాన ద్వారం మూసివేశారు. యూనివర్సిటీ పోలీసులు అక్కడికి చేరుకోవడంతో విద్యార్థులు పరిపాలనా భవనం ఎదుట మెట్లపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, ఇతర అధికారులు విద్యార్థుల వద్దకు చేరుకుని సమ్మె విరమించి తరగతులకు హాజరుకావాలని సూచించారు. స్టైఫండ్ పెంచుతూ ప్రభుత్వం నుంచి జీవో విడుదల చేసే వరకు సమ్మె విరమించేదిలేదని విద్యార్థులు ముక్తకంఠంతో చెప్పడంతో కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జగపతిరామయ్యను పిలిచి మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్‌చేసి తరగతులు బహిష్కరించి సమ్మె చేస్తున్న సమాచారం అందించాలని, విద్యార్థుల వద్ద సెల్‌ఫోన్లను తీసుకోవాలని నోటీసు జారీ చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు. దీక్షలో భాగంగా గురువారం ఉదయం 10 గంటలకు వర్సిటీ ప్రధాన ద్వారం నుంచి బాలాజీకాలనీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్‌గా శాంతి నాడార్

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 302 (రాయలసీమ, తమిళనాడు, కర్ణాటక, కేరళ) రాష్ట్రాల డిప్యూటీ గవర్నర్‌గా తిరుపతికి చెందిన వినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యురాలు శాంతి నాడార్ ఎంపికయ్యారని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి తెలిపారు. ప్రతినిధులు డాక్టర్ రవిరాజు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, మాధవనాయుడులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం తిరుపతిలోని చెన్నారెడ్డికాలనీలో చోటు చేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు.. చెన్నారెడ్డికాలనీకి చెందిన వెంకటేష్ తిరుమలలో దుకాణం నడుపుతున్నాడు. అతని భార్య భారతి చెన్నారెడ్డికాలనీలో టిఫిన్ షాపు నిర్వహిస్తోంది. పనుల్లో తనకు సహాయపడడం లేదని కుమార్తె ఉమామహేశ్వరి(23)ని తల్లి మందలించింది. మనస్తాపం చెందిన ఉమామహేశ్వరి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోయకొండ గుడిలో

గాడి తప్పిన పాలన



బోయకొండ ఆలయం



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

చౌడేపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నాలుగో శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న చౌడేపల్లె మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయ పాలన గత కొంత కాలంగా గాడి తప్పింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వారానికే పాత ఆలయ కమిటీ రాజీనామాలతో రద్దయింది. అప్పటి నుంచి దేవదాయశాఖ అధికారులతోనే పాలన సాగుతోంది. ఆలయానికి సంవత్సర ఆదాయం రూ.14 కోట్లుండగా రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, డైలీవేజెస్ పద్ధతిన మొత్తం 143 మంది పని చేస్తున్నారు. ప్రధానంగా మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి ప్రతి ఆదివారం వేలసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లిస్తూ ఆలయానికి ఆదాయం కల్పిస్తున్నా ఇక్కడ పాలన మాత్రం అగమ్యగోచరంగా తయారైంది. ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ స్థాయిగల ఆలయ కార్యనిర్వహణాధికారి వున్నా కొంతమంది ఉద్యోగుల డైరెక్షన్‌లో పాలన సాగిస్తుండడంతో ఆలయ పర్యవేక్షణ గాడి తప్పిందనే విమర్శలున్నాయి. ఆలయానికి హుండీ కానుకలు, తలనీలాలు, విరాళాలు, వివిధ సేవా టికెట్లు, వివిధ వ్యాపారాల టెండర్లు, పొట్టేళ్ల తలల విక్రయాల ద్వారా, షాపుల అద్దెలు తదితర వాటి ద్వారా సుమారు రూ.14 కోట్లు వార్షికాదాయం వస్తోంది. పుంగనూరుకు చెందిన ఏకాంబరం గత వైసీపీ పాలనలో పుంగనూరు గ్రూప్ టెంపుల్స్ ఈవోగా, చిత్తూరు ఎండోమెంట్ కమిషనర్‌గా, శ్రీకాళహస్తి ఆలయ ఈవోగా పని చేసి బోయకొండ ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఆలయానికి పాలకవర్గం లేకపోవడంతో గతంలో బినామీ పేర్లతో టెండర్లు దక్కించుకున్న ఆలయ అధికారులు, కొందరు సిబ్బంది ప్రస్తుత ఈవోను ప్రభావితం చేస్తూ చేతివాటం చూపుతున్నారనే ఆరోపణలున్నాయి. నచ్చిన వారికి ప్రాధాన్యత గల పోస్టుల్లో డ్యూటీలు కేటాయిస్తున్నారు. అమ్మవారి దర్శనాల్లో సైతం కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో ఆలయ ఈవోగా పనిచేసిన చంద్రమౌళి తట్ట కాసులను పూర్తిగా నిషేధించడంతో అమ్మవారికి ఆదాయం పెరిగింది. అయితే ప్రస్తుతం కొందరు సిబ్బంది, అర్చకులు భక్తుల నుంచే నేరుగా వసూలు చేస్తూ అధికారులకు సైతం వాటాలు ఇస్తున్నారనే విమర్శలున్నాయి. ఆలయ సిబ్బందికి ఇటీవల ఇచ్చిన రూ.22.50 లక్షల అరియర్స్‌లో కూడా వాటాలు పంచుకుని డ్రా చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈవోను సైతం లెక్క చేయని టెండరుదారులను, అనధికార దర్శనాలతో ఆలయ ఆదాయానికి గండి కొడుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతో భక్తులకు మెరుగైన సేవలందించేలా చర్యలు చేపట్టాల్సివుంది.

అగ్నిప్రమాదం సంభవిస్తే..

- 'ఐవోసీఎల్'లో మాక్‌డ్రిల్



సమావేశంలో ప్రసంగిస్తున్న డిప్యూటీ కలెక్టర్ అనుపమ



ఇంధన ట్యాంకులకు మంటల వ్యాప్తిని నీటితో అరికడుతున్న ఆటోమేటిక్ అగ్ని నిరోధక యంత్రాలు (ఇన్‌సెట్‌లో) గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

యాదమరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన సహాయక చర్యలను యాదమరిలో ఉన్న ఐవోసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) సంస్థలో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం మాక్‌డ్రిల్ ద్వారా కళ్లకు కట్టినట్లు చూపారు. ఐవోసీఎల్‌లోని పదో నెంబరు ట్యాంకులో అగ్నిప్రమాదం సంభవించిందని అలారం మోగింది. వెంటనే రెస్క్యూ టీం సభ్యుల బృందం ఆధ్వర్యంలో ఫైరింజన్లతో ఫోమ్‌ను వెదజల్లి మంటలను ఆర్పింది. మరోవైపు చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిని పోలీసులు దిగ్బంధించారు. గాయపడ్డ వారిని అంబులెన్సుల్లో చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. సమీపంలో నివాసం ఉంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతమైన చిత్తూరు టెర్మినల్ రక్షిత ప్రాంతానికి తరలించి.. వైద్యం, ఆహారం అందించారు. ఐవోసీఎల్ విజ్ఞప్తి మేరకు స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ టీమ్, జిల్లా అగ్నిమాపక శాఖలు, యాదమరి పోలీసులు, రెవెన్యూ, వైద్య సిబ్బంది ఈ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, వెంకటశివయ్య మాట్లాడుతూ.. విపత్కర పరిస్థితుల్లో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ అనితాసదన్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, పశుసంవర్ధకశాఖ డీడీ ఆరీఫ్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఐవోసీఎల్ డీజీఎం అమితాబ్ సర్దార్, తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, ఎస్‌ఐ ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు కేంద్రాల పరిశీలన

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మార్చిలో నిర్వహించనున్న టెన్త్ పరీక్షలకు అవసరమైన కేంద్రాలపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు. డీఈవో వరలక్ష్మి, డీవైఈవో చంద్రశేఖర్, ఎంఈవోలు పరీక్ష కేంద్రాల కోసం పరిశీలన చేస్తున్నారు. ఎంపిక చేసిన సెంటర్లలో డెస్కులు, విద్యుత్ లైట్లు, తాగునీరు, సురక్షితమైన పాఠశాల ప్రాంగణం, విద్యార్థుల సీటింగ్ సామర్థ్యం వంటి వాటిపై దృష్టి పెట్టారు. ఈనెల 15వ తర్వాత జిల్లాలోని పరీక్ష కేంద్రాల వివరాలు రాష్ట్ర విద్యాశాఖకు పంపనున్నారు.

ఇక పురుషుల పొదుపు సంఘాలు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో పురుషుల పొదుపు సంఘాలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటి వరకు మహిళా పొదుపు సంఘాలున్న విషయం తెలిసిందే. ఇకపై పురుషుల పొదుపు సంఘాలు తొలుత మెప్మా పరిధిలో ఏర్పాటు కానున్నాయి. 18-60 ఏళ్ల మధ్య ఉన్న ఐదుగురు సభ్యులు ఒక గ్రూపుగా ఏర్పాటు చేసుకోవచ్చు. ఆధార్, రేషన్ కార్డులు తప్పక ఉండాలి. ప్రతి నెలా కనీసం రూ.100 నుంచి రూ.వెయ్యి వరకు పొదుపు చేసుకోవచ్చు. ఆరు నెలల తర్వాత రివాల్వింగ్ ఫండ్ కింద ప్రభుత్వం రూ.25వేలు ఇస్తుంది. ఆపై మొత్తాన్ని పెంచుకునే సౌలభ్యం ఉంది.

ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 1,060మంది హాజరు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 14 ఒకేషనల్ కళాశాలల్లో బుధవారం విద్యార్థులకు ప్రాక్టికల్స్ మొదలయ్యాయి. అన్ని యాజమాన్యాలకు సంబంధించి జిల్లాలో 25 ఒకేషనల్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రాక్టికల్స్ నిర్వహణ కోసం 14 కళాశాలలను ఎంపిక చేశారు. కాగా తొలి రోజున 1,060 మంది విద్యార్థులకుగాను 941 మంది హాజరవగా, 119 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో సయ్యద్ మౌల తెలిపారు.

చిరుతలు, పిల్లల కోసం..!

- అటవీశాఖ, యూనివర్సిటీ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్ల గాలింపు
- పలుచోట్ల బోన్లు పెట్టిన అధికారులు



చిరుత ఆనవాళ్లను వెతుకుతూ..



అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సబ్ డీఎఫ్‌వో నాగభూషణం

మంగళం, ఫిబ్రవరి 5 (ఆంధ్ర జ్యోతి): చిరుతలు, వాటి పిల్లల జాడ కోసం బుధవారం అటవీశాఖ.. ఎస్వీయూ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్వీయూ, వేద వర్సిటీ, ఎన్‌సీసీ ఆవరణ వెనుకవైపున కర్రలు చేతపట్టి అణువణువూ చూశారు. నెల రోజులుగా ఈ ప్రాంతంలో చిరుతల సంచారంతో భయాందోళన చెందుతున్నారు. యూనివర్సిటీలో చిరుతతోపాటు పిల్లలూ ఉన్నట్లు అటవీశాఖ అధికారులకు కొందరు ఫోన్లు చేసి సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖ, యూనివర్సిటీ సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు దాదాపు 100 మంది నాలుగు బృందాలుగా విడిపోయి చిరుత సంచరిస్తున్న ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. విద్యార్థులు కర్రలతో, కొందరు సిబ్బంది సేఫ్టీ బ్లాక్ డ్రెస్‌తో పాల్గొన్నారు. పిల్లలతో చిరుత కనిపించినట్లు తమ దృష్టికి రావడంతో అధికారులకు చెప్పి గాలింపు చర్యలు చేపట్టామని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. చిరుతల కదలికలపై ఎప్పటికప్పుడు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇస్తున్నామన్నారు. యూనివర్సిటీ పరిధిలో చిరుత ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో మూడు బోన్లను, 30 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు సబ్ డీఎఫ్‌వో నాగభూషణం తెలిపారు. వర్సిటీలో హాస్టళ్ల, జూపార్క్ రోడ్డులో ఫుడ్ కోర్టులో మిగిలిన ఆహార పదార్థాలను పడేస్తుండటంతో కుక్కలు, జింకలు వస్తున్నాయని, వీటిని వేటాడేందుకు చిరుతలూ వర్సిటీలోకి వస్తున్నట్లు వివరించారు. అందుకనే ఆహార పదార్థాలను బయట పడేయాలని, కుక్కలను పట్టి వేరేచోట వదలాలని చెప్పామన్నారు. అలిపిరి జూపార్క్ రోడ్డుకు ఇరువైపులా అటవీ ప్రాంతంలో పొదలు, కంపలు, గడ్డిని 30 మీటర్ల వరకు తొలగించాలని టీటీడీ అటవీశాఖను కోరుతామన్నారు. దీనివల్ల జంతువులు మనుషులపై అటాక్ చేయడం గానీ, రోడ్డు దాటి వర్సిటీ వైపు రావడం తగ్గుతుందన్నారు. చిరుత, వాటి పిల్లల ఆనవాళ్లు కనపడలేదన్నారు. ప్రతిరోజూ ఈ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తుంటామన్నారు. తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ముంగిలిపట్టులో దొంగల హల్‌చల్

- తొమ్మిదిళ్లలో చొరబడి రెండిళ్ళలో చోరీ



చిందర వందరగా పడివున్న సామగ్రి



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

చంద్రగిరి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ముంగిలిపట్టులో దొంగలు హల్‌చల్ చేశారు. తొమ్మిది ఇళ్ళల్లోకి చొరబడ్డారు. రెండు ఇళ్ళల్లో చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి కె.లీల, ప్రతాప్‌నాయుడు, రామ్మూర్తినాయుడు, శివలక్ష్మణ్, సోమేశ్వరనాయుడు, గిరినాయుడు, దిలీప్, నాగమ్మ ఇళ్ళతో పాటు ఎస్టీకాలనీలోని మురళి ఇంటిలో దొంగలు చొరబడ్డారు. కె.లీల ఇంట్లో లక్ష రూపాయల నగదు, 30 గ్రాముల బంగారు ఆభరణాలు, మురళి ఇంట్లో 20 గ్రాముల బంగారు కమ్మలు తీసుకుపోయారు. బుధవారం ఉదయం బాధితుల ఫిర్యాదుతో సీఐ సుబ్బరామిరెడ్డి, సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. వారి ఇళ్ళను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో పాటు వేలి ముద్రల నిపుణులు వచ్చారు. వివరాలు సేకరించారు. క్రైం అడిషనల్ ఎస్పీ నాగభూషణం, క్రైం డీఎస్పీ శ్యామ్ సుందర్, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐ ప్రసాద్‌లు చేరుకుని సీసీ ఫుటేజ్ ద్వారా ఆధారాలు సేకరించారు. సుమారు ఏడుగురు దుండగులు చోరీలకు పాల్పడినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. తాళం వేసి ఉన్న ఇళ్లను ముందుగా గుర్తించి మధ్యప్రదేశ్‌కు చెందిన దుండగులు ఈ తరహా చోరీలకు పాల్పడినట్లు భావిస్తున్నారు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నాకు న్యాయం చేయండి

- భర్త మృతదేహం వద్ద రోదన
- ముగ్గురు పిల్లలతో కలిసి చనిపోతానంటూ పెట్రోల్ క్యాన్ పట్టుకుని నిరసన
- గ్రామస్తుల పంచాయితీతో అంత్యక్రియలు పూర్తి



వెంకటేష్ మృతదేహం రోదిస్తున్న పిల్లలు, పెట్రోల్ క్యాన్‌తో గిరిజ

శ్రీరంగరాజపురం ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 'నాకు న్యాయం చేయండి' అంటూ భర్త వెంకటేష్ మృతదేహం వద్ద ఎస్‌ఆర్‌పురం మండలం పాతపాళ్యం గ్రామానికి చెందిన గిరిజ రోదించారు. ఇంట్లో ఉన్న తన భర్తను తీసుకెళ్లి ఆయన మృతికి కారకుడైన వ్యక్తిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే తన ముగ్గురు పిల్లలతో కలిసి చనిపోతానంటూ పెట్రోల్ క్యాన్ పట్టుకుని బుధవారం నిరసన తెలిపారు. సోమవారం పుల్లూరు క్రాస్ సమీపంలో లగేజీ వ్యాన్ బోల్తా పడిన ప్రమాదంలో వెంకటేష్ మృతి చెందగా, తాము చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయలేదని గిరిజ ఆరోపించారు. గ్రామస్తులు కల్పించుకుని సంబంధిత వ్యక్తిని పిలిపించి పంచాయితీ చేయడంతో వివాదం సద్దుమణిగింది. ఆపై వెంకటేష్ మృతదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి టీడీపీ యువనేత, ఎన్‌ఆర్‌ఐ బాలు ఆర్థిక సాయం చేశారు.

ఆర్టీసీకి రథసప్తమి ఆదాయం రూ.కోటి

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం నిర్వహించిన రథసప్తమి పండుగను పురస్కరించుకుని ఆర్టీసీకి రూ.కోటి ఆదాయం లభించింది. అదనపు బస్సులను ఏర్పాటు చేసి తిరుపతి నుంచి తిరుమలకు 1,894 ట్రిప్పులతో 41,959మందిని చేర్చారు. అలాగే తిరుమల నుంచి తిరుపతికి 1,907 ట్రిప్పులతో 59,659మందిని తరలించారు. మొత్తం 1,01,618మంది భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా భక్తులను తరలించి రికార్డు నమోదు చేశారు. డీపీటీవో నరసింహులు ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు.

అనాథ వృద్ధుడికి అంతిమ సంస్కారాలు



అంతిమ సంస్కారాలు నిర్వహించిన హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, పోలీసులు

పలమనేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు బుధవారం ఓ అనాథ వృద్ధుడికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. పలమనేరు సమీపంలోని గంటావూరు వద్ద ఉన్న జాతీయ రహదారి వద్ద రెండు రోజుల క్రితం సుమారు 65 ఏళ్ల గుర్తుతెలియని వృద్ధుడి శవాన్ని కనుగొన్నారు. దీనిపై పోలీసులు మృతదేహాన్ని పలమనేరు మార్చురీలో భద్రపరచి రెండు రోజుల పాటు విచారణ చేపట్టారు. అయితే ఆచూకీ తెలియక అనాథ శవంగా గుర్తించారు. దీంతో బుధవారం పలమనేరు పోలీసుల సమక్షంలో స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శివ, ఎల్లంపల్లి నరేంద్ర, పృథ్వీరాజ్, మదేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే క్యాన్సర్ నయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేసులు

పలమనేరు, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే మందులతో క్యాన్సర్ నయం చేసుకోవచ్చని.. మారుతున్న ఆహారపు అలవాట్లు జీవన శైలిపై తీవ్ర ప్రభావం చూపుతోందని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు అన్నారు. బుధవారం పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జంతు, వృక్షశాస్త్ర విభాగం సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మానవునిలో వచ్చిన తీవ్రమైన ఆహారపు అలవాట్లు, పర్యావరణ సమతుల్య లోపంతో క్యాన్సర్ బారిన పడుతున్నారని.. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లును అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జయశంకర్, హేమలత, డాక్టర్ శశికళ, డాక్టర్. బెనజీర్, సురేష్‌కుమార్, బాలాజీ, డాక్టర్. ఎం.రాజేష్‌బాబు, రజని, పావని, తహసీన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర కార్మిక వ్యతిరేక చట్టాలపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు గిరిధరగుప్తా తదితరులు

పలమనేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని బుధవారం సీఐటీయూ నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు గిరిధరగుప్తా మాట్లాడుతూ కార్మికులు పోరాడి తెచ్చుకొన్న 29 కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేసిందన్నారు. లేబర్‌కోడ్స్ అమలు చేసేందుకు గాను 2019లో వేతనాల కోడ్, 2020లో పారిశ్రామిక సంబంధాల కోడ్, వృత్తి భద్రత, ఆరోగ్యం కోడ్ తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ లక్ష్మయ్య, జానకి రాముడు, రవి, సంజయ్ శర్మ, ఆటోయూనియన్ కార్యదర్శి రమేష్, రాజేస్, మురగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో అక్రమాలపై విచారణ ప్రారంభం

పలమనేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలోని గంటవూరు ఇందిరమ్మ కాలనీలో ఖాళీగా ఉన్న నివేశస్థలాలు, ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నట్లు వచ్చిన సమాచారంపై బుధవారం తహసీల్దార్ ఇన్బనాథన్ సిబ్బంది, అధికారులతో కూడిన బృందాలు విచారణ ప్రారంభించారు. వారంరోజుల క్రితం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి స్పందించి అధికారులతో సూచించారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందించిన తహసీల్దార్ ఇన్బనాథన్ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరమ్మకాలనీలో అక్రమాల జరిగా అంటూ విచారణ చేపట్టారు.

డంపింగ్‌యార్డుకు ఫెన్సింగ్ ఏర్పాటు



బైరెడ్డిపల్లెలో డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో డంపింగ్ యార్డు ఉన్న చోట స్థలం ఆక్రమణలకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య తెలిపారు. గ్రామంలో సేకంచిన చెత్త, వ్యర్థ పదార్థాలను డంపింగ్‌యార్డుకు తరలించి అక్కడ ఉన్న షెడ్డులో చెత్తనుంచి సంపద తయారీ చేపడుతున్నారు. భవిష్యత్తులో డంపింగ్ యార్డుకు సంబంధించి ఎలాంటి సమస్య రాకుండా ఉండేలా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి నిర్వహణపై ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నట్లు కార్యదర్శి తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



తారురోడ్డు పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పుంగనూరు మండల టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఈడిగపల్లె నుంచి అరంట్లపల్లె వరకు దాదాపు రెండున్నర కిలో మీటర్ల వరకు జరుగుతున్న పనులను టీడీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతిగుంట్లపల్లె సమీపంలో నిర్మించిన ప్రాజెక్టు పనులకు మట్టి తరలించడంతో రోడ్డు మరమ్మతులకు గురైందన్నారు. రోడ్డు మరమ్మతులపై టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డా సంక్షేమం



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

చౌడేపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని.. మంచి ఆహారంతోనే తల్లీ బిడ్డ సంక్షేమంగా ఉంటారని సీడీపీవో రాజేశ్వరి అన్నారు. బుధవారం సోమల అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు ఆహ్వాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ప్రదీప్, సూపర్‌వైజర్ హరిత, సీహెచ్‌వో అమర్‌నాథ్, మాజీ సర్పంచ్ శ్రీరాములు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పేటీఎం ఫౌండేషన్‌తో కుప్పానికి రెండు అంబులెన్సులు



పేటీఎంతో ఎంవోయూ కుదుర్చుకుంటున్న కడా పీవో వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్

కుప్పం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పేటీఎం ఆధ్వర్యంలో కుప్పం ప్రాంతానికి రెండు అంబులెన్సులను సమకూర్చేందుకు కడా పీవో వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ ఒప్పందం కుదుర్చుకున్నారు. బుధవారం ప్రాజెక్టు కార్యాలయంలో పేటీఎం సంస్థ ప్రతినిధులతో ఏరియా ఆసుపత్రికి రూ. 66 లక్షల విలువ గల రెండు అత్యాధునిక వసతులున్న అంబులెన్సులను అందించేందుకు ఎంవోయూ చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ వైస్ చైర్మన్ పీ.ఎస్.మునిరత్నం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు పాల్గొన్నారు.

గుండెపోటుపై అవగాహన అవసరం



గుండెపోటుపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు ప్రవీణ్‌కుమార్

వి.కోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌సీ వైద్యులు ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం వి.కోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గుండెపోటుపై వైద్యాధికారి మురళీ నేతృత్వంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం మారిన ప్రజల జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటుకు గురవుతున్నారని తెలిపారు. ఆకస్మికంగా గుండెపోటు వచ్చినప్పుడు తొలి గంటలోపు అత్యవసర ఇంజక్షన్ ఇస్తే రోగి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. వి.కోట సీహెచ్‌సీలో గుండెపోటుకు గురైన వారికి రూ.42 వేలు ఖరీదు చేసే ఇంజక్షన్ ఉచితంగా అందుబాటులో ఉంచారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డా. సంపత్‌కిరన్, డా. కల్పన, డా, అశ్విని, ప్రమీళ పాల్గొన్నారు.

నందివాహనంపై కాశీవిశ్వేశ్వరస్వామి

చౌడేపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చారాలలో వెలసిన అన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి బుధవారం నందివాహనంపై ఊరేగారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని చారాల బండపై వెలసిన అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

అశ్వవాహనంపై ధ్యానాభిరాముడి విహారం

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కార్వేటి కొండ ధ్యానాభిరామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అశ్వవాహం స్వామివారు ఊరేగారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీపతి ఆచార్యులు సీతాలక్ష్మణ సమేత ధ్యానాభిరామస్వామి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ గావించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల నుంచి రుణాలు పొందేందుకు అర్హులు ఈనెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని బైరెడ్డిపల్లె ఎంపీడీవో రాజేంద్రబాలాజీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 55 యూనిట్లు, మైనారిటీ కార్పొరేషన్‌కు సంబంధించి 18 యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు. అర్హులైన వారు సంబంధిత గ్రామసచివాలయాల్లో దరఖాస్తు చేసకొని జిరాక్స్‌లకు మండల పరిషత్ కార్యాలయంలో అందించాలని కోరారు.

● రామకుప్పం: వివిధ కుల కార్పోరేషన్లతో 82 యూనిట్లు మంజూరయ్యాయని ఎంపీడీవో మురళీధర్ తెలిపారు. ఈనెల 7లోపు దరఖాస్తు చేసుకోవాలని.. వివరాలకు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

దుకాణంలో చోరీ



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పోలీసుస్టేషన్‌కు కూత వేటు దూరంలోని ఓ ద్విచక్రవాహనాల స్పేర్‌పార్ట్స్ దుకాణంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు రేకుల షెడ్డును ధ్వంసం చేసి చోరీ చేశారు. బాధితుడి కథనం మేరకు.. స్థానిక మదనపల్లె రోడ్డులో అర్ధరాత్రి దుండగులు షెడ్డుకు ఏర్పాటు చేసిన రేకులను తొలగించి ద్విచక్ర వాహనాలను తీసుకెళ్లారు. దీంతో బాధితుడు బాబాజాన్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిఘా ఏర్పాటు చేసి చోరీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా బుధవారం జరిగినట్లు జిల్లా ప్రత్యేక అధికారి విజయనందరాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని 14 కేంద్రాల్లో 1,056 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 940 మంది మాత్రమే పరీక్షలకు హాజరైనట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

వి.కోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వి.కోటలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను గురువారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సీతారామయ్య తెలిపారు. 6న అంకురార్పణ, ధ్వజారోహణం, రాత్రికి హంస వాహనం, 7న ప్రత్యేక పూజలు, సింహవాహనం, 8న వివిధ రకాల అభిషేకాలు, హనుమంత వాహనం, 9న విశేష అలంకరణ, శేష వాహనం, 10న కాశీయాత్ర, కల్యాణోత్సవం, గరుడ సేవ, 11న గజవాహనం, 12న రథోత్సవం, ధూళిసేవ, 13న దీపోత్సవం, 14న వసంతోత్సవం, శయనోత్సవం, 15న ద్వాదశి హారతులు, శాంతి ఉత్సవం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలను వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు.

గ్రామాల్లో సమస్యలకు తక్షణ పరిష్కారం

●తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి ● కలెక్టర్ సుమిత్‌కుమార్



రెవెన్యూ సమస్యలపై ఆరా తీస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న సంక్షేమాధికారి రబ్బానిబాషా

పెద్దపంజాణి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. బుధవారం పెద్దపంజాణి తహసీల్దారు కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య చర్యలు విధిగా నిర్వహించాలని సూచించారు. మంచి నీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. పలమనేరు ఆర్డీవో భవాని, తహసీల్దారు అనిల్‌కుమార్, ఎంపీడీవో బాలాజీ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కల్లూరు బీసీ హాస్టల్ తనిఖీ

కల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు బీసీ హాస్టల్‌ను బుధవారం రాత్రి జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమాధికారి రబ్బాని బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా హాస్టల్ గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. భోజనం, హాస్టల్‌లో సౌకర్యాలు, వార్డెన్, సిబ్బంది పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సమస్యలను జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లారు. హాస్టల్లో పనిచేస్తున్న అటెండర్ దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. హాస్టల్లో నెల కొన్న సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అటెండర్‌పై నిబంధనల మేరకు తక్షణం చర్యలు తీసుకుంటానని తెలిపారు. హాస్టల్‌లో అభివృద్ధి పనులకు తక్షణం చర్యలు తీసుకుంటామని.. త్వరలోనే సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులను ఆస్పత్రికి తరలిస్తే నగదు పారితోషికం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీఐ సుప్రియ, వైద్యాధికారి మధుసూదనాచారి

పుంగనూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన వారికి ప్రభుత్వం రూ.5 వేలు నగదు పారితోషికం అందిస్తుందని పుంగనూరు ఎంవీఐ సుప్రియ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదనాచారి, వైద్యసిబ్బందితో కలిసి రోడ్డు భద్రత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు సహాయం చేయడం అందరి బాధ్యతని.. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల్లో గంటకొకరు చనిపోతున్నారని చెప్పారు. ప్రమాదం జరిగిన గంటలోపు ఆసుపత్రికి తీసుకెళితే కోలుకునే అవకాశాలున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం వితరణ



కార్మికులకు యూనిఫాం అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ అలీంబాషా

పుంగనూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న 84 మందికి బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎస్.అలీంబాషా యూనిఫాంతోపాటు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్న వారిని అన్నిరకాలుగా ఆదుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులు ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించాల్సి ఉందని.. వేతనాలు పెంచి వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లిస్తే ప్రయోజనాలు



సూచనలిస్తున్న ఇన్‌కంట్యాక్స్ అడిషనల్ కమిషనర్ వంశీధర్

గంగవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను సకాలంలో చెల్లిస్తే అనేక ప్రయోజనాలు చేకూరుతాయని తిరుపతి ఇన్‌కంట్యాక్స్ అడిషనల్ కమిషనర్ వంశీధర్ పేర్కొన్నారు. బుధవారం గంగవరంలోని ఓ ప్రైవేటు హాల్‌లో పలమనేరు పరిసర ప్రాంతాలకు చెందిన అకౌంటెంట్లు, ప్రముఖ విద్యాసంస్థల అధినేతలు, వ్యాపారులతో ట్యాక్స్ చెల్లింపుతో కలిగే ప్రయోజనాలు, చెల్లించే విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌కంట్యాక్స్ చెల్లిస్తే బ్యాంకుల నుంచి రుణాలు సకాలంలో అందుతాయన్నారు. కార్యక్రమంలో పలమనేరు ఇన్‌కంట్యాక్స్ అధికారి వెంకటేశులు, ఎస్‌వీఎంఎస్ అధినేత సుభాష్ చంద్రబోస్, బాబునాయుడు, ఆడిటర్స్ బాలాజీ, అరుణ్‌తేజ్, కీర్తి, ప్రవీణ్, అకౌంటెంట్లు మస్తాన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూములను కాపాడండి



శ్రీనివాసులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని దేవాలయాల భూములను కబ్జా చేస్తున్నారని.. కాపాడాలని పెద్దపంజాణి మండలం కొలత్తూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. గ్రామంలోని గంగమ్మ, రణభేరమ్మ, సప్పలమ్మ ఆలయాలకు సంబంధించిన భూముల్లో కొంత స్థలంలో గ్రామ సచివాలయం నిర్మించారని వివరించారు. సచివాలయానికి ఆనుకుని ఉన్న దేవాలయ భూమిలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తున్నారని ఆరోపించారు. రచ్చబండ స్థలాన్ని ఆక్రమించి రూ.20 లక్షలకు విక్రయించారని చెప్పారు. ఈ విషయంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి దేవాలయ భూములను కాపాడాలని ఆయన కోరారు.

గడ్డివామి దగ్ధం

పలమనేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కపల్లి గ్రామం వద్ద బుధవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో మాజీ సర్పంచ్ ఈశ్వరయ్యకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. పలమనేరు అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు.

దోబీ ఘాట్‌లో మౌలిక వసతులకు కృషి



దోబీ ఘాట్‌ను పరిశీలిస్తున్న బీసీ కార్పోరేషన్ ఈడీ శ్రీదేవి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు దోబీ ఘాట్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు చిత్తూరు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక దోబీ ఘాట్‌ను ఆమె పరిశీలించి రజక సంఘ నాయకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఘాట్‌కు మరమ్మతులు వెంటనే చేపట్టడానికి రూ. 3 లక్షలు నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. అక్కడి సమస్యలపై ఆమె ఆరా తీసి త్వరలోనే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట రంజక సంఘ నాయకులు రమేశ్, శ్రీనివాసులు, గంగాధర్, నాగరాజ, వెంకటరమణ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలంతో రూ.1.28 లక్షల ఆదాయం



వేలంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్‌బాబు

కల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల వేలంలో పులిచెర్ల పంచాయతీకి రూ.1,28,956 ఆదాయం లభించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్ బాబు తెలిపారు. పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కార్యాలయంలో బుధవారం పంచాయతీ పరిధిలో 6 చేపల చెరువులకు వేలం నిర్వహించారు. వేలంలో ఎర్రచెరువు రూ.53,560, అవ్వచెరువు రూ.46,350, అగ్రహారంకుంట రూ.15,450, రాతి చెరువు రూ.4,120, ఈరసానికుంట రూ.3,708, గాండ్లవాని కుంట రూ.5,768కి లకు గుత్తేదారులు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేలంలో చేపల చెరువులను దక్కించుకున్న గుత్తేదారులు ఈనెల 10వ తేదీలోపు పూర్తి నగదు చెల్లించి చెరువుల్లో చేపపిల్లలను వదులుకోవాలన్నారు. చెరువుల్లో చేపలను పెంచుకునేందుకు ఈ ఏడాది జూన్ 2025 వరకు కాలపరిమితి ఉంటుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు సురేష్, రమేష్, గుత్తేదారులు రామనాధంనాయుడు, మధు, నాగరాజ, మురళీ, వినాయక, సునీల్, టీడీపీ నాయకులు రామకృష్ణమనాయుడు, బాబు, ఖాదర్‌వల్లి, సుధాకర్ పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ



రోగులకు పాలు, పండ్లు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వి.కోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ వి.కోట గ్రేటర్ వారిచే ప్రభుత్వాసుపత్రిలో బాలింతలకు పాలు, పండ్లు, రొట్టెలు అందించారు. ప్రతి నెల 5వ తేదీన జరిగే కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రిలో మాతృమూర్తులకు అవసరమైన బేబీ కిట్లను సైతం బహూకరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ధీరజ్, కార్యదర్శి మురుగేష్, కోశాధికారి లక్ష్మణ్‌చౌదరి, సభ్యులు నాగరాజ్, తుకారం, రమేష్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల పొడిగింపు

కుప్పం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులు వైన్‌షాపుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు పొడగించినట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజ్ తెలిపారు. గుడుపల్లె మండలానికి ఓ దుకాణం కేటాయించగా ఇప్పటికి కేవలం ఒక్క దరఖాస్తు అందిందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 8న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారని పేర్కొన్నారు.

అర్హులకు స్వయం ఉపాధి రుణాలు



బ్యాంకు మేనేజర్లతో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలాజీ

పెద్దపంజాణి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అర్హులకు స్వయం ఉపాధి రుణాలు అందించాలని ఎంపీడీవో బాలాజీ బ్యాంకు అధికారులను కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ భరత్

కుప్పం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ భరత్ బుధవారం కలిశారు. కుప్పం నియోజకవర్గంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యరక్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారని ఆయన తెలిపారు.

ఉపాధి పనుల వేగవంతం

పెద్దపంజాణి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో బాలాజీ క్షేత్ర సహాయకులకు సూచించారు. బుధవారం పెద్దపంజాణి మండల పరిషత్తు కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షించారు. మండలంలో అన్ని గ్రామాలలో ఉపాధిహామీ పనులు వేగవంతం చేయాలన్నారు. కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. ఏపీవో మురుగేష్ , సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలపై విషం కక్కుతున్న జగన్ రెడ్డి: టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బీసీలపై మాజీ సీఎం జగన్ రెడ్డి విషం కక్కుతున్నారని టీడీపీ నేతలు మండిపడ్డారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. మద్యం దుకాణాల్లో 10 శాతం దుకాణాలను కల్లుగీత కార్మికులకు కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని జగన్ రెడ్డి తన పార్టీ నాయకుల ద్వారా హైకోర్టులో స్టేకోసం పిటిషన్ దాఖలు చేయించడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. బీసీలు ఆర్థికంగా ఎదిగితే చూసి ఓర్వలేకనే ఇలా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు మోహన్ రాజ్, మేషాక్, షబ్బీర్ బాషా, బాబు నాయుడు, ధరణి ప్రకాష్ మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో వచ్చిన అర్జీల సంగతేంటి?: ట్రైనీ కలెక్టర్


వీఆర్వోతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ హిమవంశీ

పెనుమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రీసర్వే జరిగిన చోట గ్రామసభల్లోనూ, రెవెన్యూ సదస్సుల్లోనూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఏమి చేశారని తహసీల్దారు శ్రావణ్ కుమార్‌ను ట్రైనీ కలెక్టర్ హిమవంశీ ప్రశ్నించి, వివరాలు తెలుసుకున్నారు. బుధవారం పెనుమూరులో వీఆర్వో, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ప్రజలు ఇచ్చే అర్జీలపై తక్షణమే స్పందించాలని సూచించారు. నంజరపల్లె రెవెన్యూ గ్రామంలో ఎంతవరకు రీసర్వే పనులు జరిగాయని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కుంట పోరంబోకు స్థలం కాపాడండి: రైతుల ధర్నా



పెనుమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు గ్రామ రెవెన్యూ దాఖలా సర్వే నెంబరు 468-1లో 86 సెంట్ల కుంట పోరంబోకు స్థలాన్ని కాపాడాలని స్థానిక రైతులతో కలిసి నాగరాజనాయుడు ధర్నా నిర్వహించారు. బుధవారం తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేస్తుండగా ఆర్డీవో శ్రీనివాసులు కూడా ఆరాతీశారు. నోటీసులు ఇచ్చామని తహసీల్దారు తెలియజేస్తూ.. ఈ స్థలంపై హైకోర్టులో పిల్ వేశారని 60 రోజులు గడువు ఉండటంతో చర్యలు తీసుకోలేకున్నామని వివరించారు. 60 రోజుల గడువు పూర్తవగానే న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

మా కడుపులు కొట్టొద్దు / పాత బస్టాండులోని దుకాణదారుల నిరసన


గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దుకాణదారులు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తమ కడుపులు కొట్టొద్దని పాత బస్టాండుకు చెందిన దుకాణదారులు విజ్ఞప్తి చేశారు. బుధవారం గాంధీ విగ్రహం వద్ద ఈ మేరకు నిరసన తెలిపారు. ఏళ్ల తరబడి దుకాణాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ఉన్నట్టుండి దుకాణాలను ఖాళీ చేయమనడం సబబు కాదన్నారు. తమ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని బస్టాండులోనే దుకాణాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సమస్య పరిష్కారమయ్యేదాకా గురువారం నుంచి జనతాబజారు వద్ద రిలే నిరాహార దీక్షను చేపట్టనున్నట్లు ప్రకటించారు. షాప్ కీపర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదు : సీఐటీయూ, ఏఐటీయూసీ


నగరిలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్ అన్నారు. బుధవారం గాంధీ విగ్రహం ఎదుట ఏఐటీయూసీ నేతలతో కలిసి నిరసన తెలిపారు. కార్మికులకు అన్యాయం జరిగే కార్మిక కోడ్లను కేంద్రం అమలు చేయాలని చూస్తోందని, ఇది చాలా దారుణమన్నారు. యూనియన్ నాయకులు జ్యోతి కుమార్, ఆరోగ్యదాస్, శివ, అర్జున్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నగరి: కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ ఏఐటీయూసీ నాయకులు నగరి అంబేడ్కర్ కూడలి వద్ద కేంద్ర బడ్జెట్ ప్రతులను బుధవారం దహనం చేశారు. నాయకులు కోదండయ్య, శేఖర్, బాషా, సతీష్, రమేష్, సత్తార్, ఏసుదాస్, చీరావుద్దీన్, చిన్నరాజ్, రాజేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు పక్కన పేడదిబ్బలు తొలగించండి: డీపీవో


సిబ్బందికి సూచనలిస్తున్న డీపీవో సుధాకరరావు

యాదమరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కోనాపల్లె గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం డీపీవో సుధాకరరావు పరిశీలించారు. వర్మి కంపోస్టు ఎరువు తయారీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం పనులు సక్రమంగా అమలు చేయాలని సూచించారు. రోడ్డు పక్కనే పేడదిబ్బలు ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, కార్యదర్శులు కల్పన, హర్ష పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో గుండెనొప్పికి ఇంజక్షన్

పెనుమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు సీహెచ్‌సీలో ఇప్పుడు గుండెనొప్పికి ఇంజక్షన్ అందుబాటులో ఉందని వైద్యులు తెలిపారు. బుధవారం సీహెచ్‌సీలో హృదయ రక్ష స్టెమీ ప్రోగ్రాంపై ప్రజలకు అవగాహన కల్పించారు. టేనిక్ప్లేస్ అనే ఇంజక్షన్ రూ.45వేలు అవుతుందని, ఇప్పుడు ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందని వివరించారు.

పిల్లలకు పోషకాహారాన్ని అందజేయండి

నింద్ర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు పోషకాహారాన్ని అందజేయాలని సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. బుధవారం ఆరూరు అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య సంరక్షణ, విద్య కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం బాలకృష్ణ, అంగన్వాడీ కార్యకర్త కాంతమ్మ, హెల్పర్లు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

విజయపురం: మాధవరం అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో కృష్ణవేణి, సూపర్‌వైజర్ లక్ష్మీ, కార్యకర్త ఉమ పాల్గొన్నారు.

నగరి: మున్సిపల్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో కృష్ణవేణి, హెచ్ఎం దేవి, సూపర్‌వైజర్ శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.





ఏ నిమిషానికి ఏమి జరుగునో..!

శిథిలావస్థలో కార్వేటినగరం ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహం

ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

కార్వేటినగరం ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఏ నిమిషానికి ఏమి జరుగునో అన్న స్థితిలో ఉంది. వానొస్తే ఉరుస్తోంది. తరచుగా భవనం పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. ఇక్కడ 32 మంది విద్యార్థులు ఉంటున్నట్లు వసతి గృహ సంక్షేమ అధికారి వాసు తెలియజేశారు.

- వెదురుకుప్పం, ఆంధ్రజ్యోతి



మరుగుదొడ్లు, స్నానపు గదులిలా..

మరుగుదొడ్లు, స్నానపు గదులదీ అదేదారి. ఇవి కూడా దుస్థితిలో ఉన్నాయి. ఇకనైనా విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి భారతి

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడపడం ప్రమాదకరమని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భారతి అన్నారు. 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ట్రాఫిక్ నిబంధనలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం ద్విచక్రవాహన ప్రమాదాలే ఉన్నాయన్నారు. డీటీసీ నిరంజన్ రెడ్డి, ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు రాజేశ్వరరావు, టీఎస్ మురళి, నరసింహులు, దీపిక తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో తనిఖీలు


రికార్డులు తనిఖీ చేస్తున్న జయప్రకాష్‌నాయుడు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం భవిత కేంద్రాన్ని సహిత విద్యా జిల్లా సమన్వయకర్త జయప్రకాష్ నాయుడు బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ పరిశీలించారు. పిల్లల శారీరక, మానసిక పరిస్థితులను సహిత ఉపాధ్యాయులు సింధూజ, రేఖను అడిగి తెలుసుకున్నారు. అలాగే అక్కడ మధ్యాహ్న భోజనాన్నీ తనిఖీ చేశారు.

విద్యార్థులంతా ఉన్నత స్థాయికి చేరుకోవాలి


విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల నిర్వాహకులు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా ఉన్నత స్థాయికి చేరుకోవాలని శ్రీవివేకానంద జూనియర్ కళాశాల అధినేతలు భాస్కర్‌నాయుడు, మహేంద్రకుమార్ ఆకాంక్షించారు. కళాశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఓ కల్యాణ మండపంలో నిర్వహించారు. అకడమిక్ ఇయర్‌లో రాణించిన విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే సానుభూతి


బాలిక మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న భానుప్రకాష్

నింద్ర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేఆర్‌పాలెంకు చెందిన బాలిక హరీషా పాముకాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బుధవారం ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాధితులకు సానుభూతి తెలిపారు. ఆయనవెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

నలుగురి దుర్మరణానికి కారణమైన లారీ స్వాధీనం


లారీ వద్ద సీఐ మహేశ్వర్ తదితరులు

నగరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరిలో ఈనెల రెండో తేదీన ప్రైవేటు బస్సును ఢీకొట్టి నలుగురి దుర్మరణానికి కారణమైన లారీని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. టీఎన్ 23 బీఈ 5618 అనే నెంబరుగల సిమెంటు లారీ వేలూరుకు చెందినదిగా గుర్తించారు. అనకాపల్లి నుంచి చెన్నైకి సిమెంటు తరలిస్తుండగా ప్రైవేటు బస్సును ఢీకొట్టినట్లు తేలింది. సీసీ కెమెరాల ఆధారంగా లారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ని అరెస్టు చేసినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు.

10న 'నులిపురుగుల నిర్మూలన' కార్యక్రమం

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం కార్యక్రమం ఈనెల పదో తేదీన అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులకు ఉచితంగా ఆల్బెండజోల్ 400 మి.గ్రా. మాత్రలను పంపిణీ చేయాలని చెప్పారు. డీసీహెచ్ఎస్ ప్రభావతి, డీపీఎంవో హనుమంతరావు, ఎన్‌సీడీ ప్రాజెక్టు ఆఫీసర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించాలి: ఈఈ


అర్జీ స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఆదేశించారు. బుధవారం గాంధీరోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వినియోగదారుల నుంచి ఆరు అర్జీలు రాగా.. ఓ సమస్యను అప్పటికప్పుడే పరిష్కరించినట్లు ఈఈ తెలిపారు. మిగిలిన అర్జీలనూ విచారించి, పరిష్కరిస్తామన్నారు. డీఈలు ఆనంద్, ప్రసాద్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీహోమం



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుర్రప్ప నాయుడు వీధిలోని అంకాల పరమేశ్వరి అమ్మవారి కుంభాభిషేకం జరిగి ఐదేళ్లవడంతో బుధవారం ఆలయంలో చండీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు బి.కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి జల, క్షీరాభిషేకాలతోపాటు భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ సభ్యుడు కేఎం కుమార్ పాల్గొన్నారు.

అమర జవాన్ కుటుంబానికి పరామర్శ


జవాన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం పొందిన ఎగువ రాగిమానుపెంటకు చెందిన పంగళ కార్తీక్ యాదవ్ కుటుంబాన్ని డీఆర్వో మోహన్ కుమార్ బుధవారం పరామర్శించారు. జవాన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, మాజీ సైనికుల సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పలువురి శుభాకాంక్షలు



చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్‌కు బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్ర కుమార్, సప్తగిరి ప్రసాద్, తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, అశోక్ ఆనంద్ యాదవ్, రాజశేఖర్, మేషాక్, గోపాల్, ధరణి తదితరులున్నారు.

గురుకుల పాఠశాల స్థలం పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్వో తదితరులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మొగిలిలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని బుధవారం డీఆర్వో మోహన్ కుమార్ పరిశీలించారు. వసతి గృహ నిర్మాణానికి ఐదు ఎకరాల భూమిని కేటాయించినట్లు తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ డీఆర్వోకు వివరించారు. ఆర్ఐ మధుసూదన్, సర్వేయర్ లావణ్య, వీఆర్వో భవిత, ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఘర్షణపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దారి విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. సంతపేటకు చెందిన రుక్మాంగధకు, కార్తీక్‌లకు కొద్ది రోజులుగా దారి సమస్య ఉంది. ఈ విషయమై మంగళవారం ఘర్షణ పడ్డారు. కార్తీక, నానీలు కలిసి రుక్మాంగధపై దాడి చేయడంతో గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదుతో కార్తీక్, నానిలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత మాధవరం జట్టు

విజయపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మాధవరంలో వారంపాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటులో 30 జట్లు పాల్గొన్నాయి. ఇందులో మాధవరం జట్టు విన్నర్‌గా నిలిచింది. రన్నర్‌గా మంగళం జట్టు నిలిచింది. విన్నర్స్‌కు రూ.10వేలను పాండ్యన్, రన్నర్స్‌కు రూ.5వేలను వేణు అందించారు.

గోకులం షెడ్లు సకాలంలో పూర్తి చేయాలి

పెనుమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లు సకాలంలో పూర్తి చేయాలని లబ్ధిదారులకు అధికారులు సూచించారు. మండలానికి 85 షెడ్లు మంజూరవగా, అధికారులు మార్కింగ్ ఇస్తున్నారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఏపీవో గుణశేఖర్‌లు జలకంఠాపురం, వడ్డిగుడిసెలులో షెడ్లు మంజూరైనవారికి బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం శాతంబాకంలో సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, సెక్రటరీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాపై పర్యవేక్షణ ఉండాలి: సీపీఐ

నగరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణాపై అధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని నగరి డీఎస్పీ అజీజ్‌ను సీపీఐ నాయకులు విన్నవించారు. బుధవారం ఆయన్ను కలిసి మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా జరుగుతుందని, అడ్డుకోవాలని కోరారు. నాయకులు కోదండయ్య, వేలం బాషా శేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగు ఖర్చులు తగ్గితేనే లాభాలు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సాగుఖర్చులు తగ్గించుకుంటేనే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని ఏరువాక విస్తరణ అధికారి శివనారాయణ తెలిపారు. బుధవారం ఏరువాక కేంద్రంలో 41వ జిల్లా స్థాయి సమన్వయ సంఘం సమావేశం నిర్వహించారు. రైతులు యాంత్రీకరణ మీద దృష్టి సారించాలని సూచించారు. సహాయ పరిశోధన ఏడీ సుమతి మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో నూతన వంగడాలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు వస్తాయన్నారు. పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్, భూగర్భజల శాఖాధికారి గంగాధర్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

నగరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏకాంబరంకుప్పంకు చెందిన ఎస్ఎస్ కరుణాకరన్ (24) మంగళవారం వేకువజామున పళ్లిపట్టు రోడ్డు రాజేశ్వరి థియేటర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తొలుత స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడున్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

దేవాలయ భూములను కాపాడండి \ పెద్దపంజాణి మండలం కొలత్తూరువాసి విజ్ఞప్తి


శ్రీనివాసులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని దేవాలయాల భూములను కబ్జా చేస్తున్నారని.. కాపాడాలని పెద్దపంజాణి మండలం కొలత్తూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. గ్రామంలోని గంగమ్మ, రణభేరమ్మ, సప్పలమ్మ ఆలయాలకు సంబంధించిన భూముల్లో కొంత స్థలంలో గ్రామ సచివాలయం నిర్మించారని వివరించారు. సచివాలయానికి ఆనుకుని ఉన్న దేవాలయ భూమిలో ఓ వ్యక్తి ఇంటినిర్మాణం చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాక రచ్చబండ స్థలాన్ని కూడా ఆక్రమించి రూ.20 లక్షలకు విక్రయించారని చెప్పారు. ఈ విషయంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి దేవాలయ భూములను కాపాడాలని ఆయన కోరారు.